కోర్సు... కొలువు ఐడీబీఐ పిలుపు!

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ).. పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) కోర్సులో ప్రవేశానికి ప్రకటన విడుదలచేసింది. డిగ్రీ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి. దేశవ్యాప్తంగా 500 ఖాళీలున్నాయి. ఇలా అవకాశం వచ్చినవారు విజయవంతంగా కోర్సు పూర్తిచేసి, జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ హోదాతో ఐడీబీఐలో చేరిపోవచ్చు. వీరికి ఏడాదికి రూ.6.5 లక్షల వేతనం చెల్లిస్తారు!

చాలా బ్యాంకులు ప్రత్యేక విధుల నిమిత్తం కొంతమందిని ఎంపికచేసి, కోర్సు తర్వాత ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి. ఈ తరహా అవకాశాలకు తాజా గ్రాడ్యుయేట్లు, తక్కువ వయసు ఉన్నవారు ప్రాధాన్యమివ్వవచ్చు. ఒకవైపు ఉన్నత విద్య, మరోవైపు ఉద్యోగం రెండూ సొంతమవుతాయి. ఇలా కోర్సులో చేరినవాళ్లు ఏడాది కోర్సు తర్వాత ఉద్యోగం చేస్తూనే, మరో ఏడాది చదువునూ ఆన్‌లైన్ ద్వారా పూర్తిచేసుకుని ఎంబీఏ పట్టా అందుకునే అవకాశం ఉంది. పీజీడీబీఎఫ్ కోర్సులో ఎంపికకు ముందుగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. అందులో అర్హులకు ఇంట ర్వ్యూలు ఉంటాయి. ఈ రెండింటి ప్రతిభతో అవకాశమిస్తారు.

ఆన్‌లైన్ పరీక్ష

మొత్తం 200 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వీటికి 200 మార్కులు. పరీక్ష వ్యవధి 2 గంటలు. తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్‌లో 60, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40, జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ విభాగంలో 60 ప్రశ్నల చొప్పున వస్తాయి. వీటిని ఆబ్జెక్టివ్ తరహాలోనే అడుగుతారు. ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ప్రశ్నలుంటాయి. సెక్షన్ల వారీ సమయ నిబంధన లేదు. అయితే అర్హత సాధించడానికి సెక్షన్ల వారీ, మొత్తం మీద కనీస మార్కులు పొందడం తప్పనిసరి.

ఇంటర్వ్యూ, తుది ఎంపిక

పరీక్షలో అర్హత సాధించినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ప్రకారం విభాగాల వారీ ఒక్కో ఖాళీకి కొంత మందిని చొప్పున ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. ఈ సంఖ్యను ఐడీబీఐ నిర్ణయిస్తుంది. ఇంటర్వ్యూకి వంద మార్కులు. ఇందులో 50 మార్కులు పొందడం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైతే 45 మార్కులు రావాలి. ఇలా అర్హత మార్కులు పొందినవారి జాబితాకు ఆన్‌లైన్ పరీక్షలో వారు సాధించిన మార్కులు కలుపుతారు. పరీక్షలో సాధించిన స్కోరులో 3/4 వంతు, ఇంటర్వ్యూ స్కోరులో 1/4 వంతు కలిపి కేటగిరీల వారీ మెరిట్ జాబితా రూపొందించి, కోర్సులోకి తీసుకుంటారు.

కోర్సులో ఇలా..

మణిపాల్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, బెంగళూరులో పీజీడీబీఎఫ్ కోర్సు పూర్తి చేయాలి. ఏడాది కోర్సులో.. 6 నెలల తరగతి గది శిక్షణ, 2 నెలలు ఇంటర్న్‌షిప్, 4 నెలలు ఆన్ జాబ్ ట్రైనింగ్ ఉంటాయి. చదువు, వసతి, భోజనం అన్నీ కలిపి మొత్తం ఫీజు రూ.3 లక్షలు. దీనికి జీఎస్‌టీ అదనం. అవసరమైనవారికి ఐడీబీఐ రుణం మంజూరు చేస్తుంది. విధుల్లో చేరిన తర్వాత నెల సరి వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసుకుని, విధుల్లో కొనసాగితే అప్పటి నుంచి వరుసగా ఐదేళ్లపాటు సమాన మొత్తంలో (రూ.60 వేలు చొప్పున) ఫీజు వెనక్కి ఇచ్చేస్తారు. ఉద్యోగంలో చేరినవారు మూడేళ్లపాటు కొనసాగడం తప్పనిసరి. ఇందుకోసం ఒప్పంద పత్రాన్ని సమర్పించాలి. ఈ వ్యవధి లోపు వైదొలిగితే రూ.2 లక్షలతోపాటు, రుణం తీసుకుంటే అప్పటికి చెల్లించాల్సిన కోర్సు ఫీజు మొత్తాన్ని వడ్డీతో కలిపి వసూలు చేస్తారు.

స్టైపెండ్, వేతనం

కోర్సులో ప్రతి నెలా రూ.5000 చొప్పున మొదటి 6 మాసాలు చెల్లిస్తారు. ఆ తర్వాత నెలకు రూ.15,000 చొప్పున ఇంటర్న్‌షిప్‌లో రెండు నెలలు ఇస్తారు. చివరి నాలుగు నెలలు బ్యాంకులో వృత్తి గత శిక్షణ ఉంటుంది. ఈ సమయం లోనూ ప్రోత్సాహకం అందుతుంది. విజయవంతంగా కోర్సు పూర్తిచేసుకున్నవారికి పీజీ డిప్లొమా బ్యాంకింగ్ డిగ్రీ ప్రదానం చేసి, జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ ఓ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఈ సమయంలో ఏడాదికి రూ.6.5 లక్షల వేతనం అందుతుంది. అలవెన్సులూ దక్కుతాయి. మూడేళ్ల తర్వాత గ్రేడ్ ఏ అధికారి (అసిస్టెంట్ మేనేజర్)గా అవకాశమిస్తారు.

సన్నద్ధత ప్రణాళిక..

- పరీక్షకు సుమారు 35 రోజుల వ్యవధే ఉంది. ఈ తక్కువ సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటేనే అవకాశం దక్కుతుంది. ఇప్పటికే బ్యాంకు పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారికిది మంచి అవకాశం.
- పరీక్షలో ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- విభాగాల వారీ ఉన్న అంశాలను 25 రోజుల్లో పూర్తిచేసుకోవాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి. చివరి పది రోజులు మాక్ టెస్టులకు కేటాయించాలి. ప్రతి పరీక్ష తర్వాతా ఫలితాలు సమీక్షించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. వీటిని ఒకవైపు రాస్తూనే ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో, పీజీ డిప్లొమా ఎంట్రీ పాత ప్రశ్నపత్రాలనూ బాగా సాధన చేయాలి.
- 200 ప్రశ్నలకు 120 నిమిషాలు అంటే ప్రతి ప్రశ్నకూ కేవలం 36 సెకన్ల వ్యవధే ఉంటుంది. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో పలు ప్రశ్నలకు ఈ సమయం సరిపోదు. అందువల్ల ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలను వీలైనంత తక్కువ వ్యవధిలో పూర్తిచేసి, అక్కడ మిగిల్చిన సమయాన్ని ఈ విభాగాలకు కేటాయించగలిగితేనే ఎక్కువ ప్రశ్నలకు జవాబులు గుర్తించగలరు.
- తక్కువ వ్యవధిలో సమాధానం ఇవ్వగలిగే ప్రశ్నలే ముందు ప్రయత్నించాలి. ఆ తర్వాత కాస్త సమయం తీసుకున్నప్పటికీ కచ్చితంగా జవాబు గుర్తించగలిగేవాటి సంగతి చూడాలి. జవాబు గుర్తించడమెలాగో తెలిసినప్పటికీ ఎక్కువ సమయం తీసుకునేవాటిని చివరలోనే ప్రయత్నించాలి.
- రుణాత్మక మార్కులున్నాయి కాబట్టి అసలేమాత్రం తెలియనివాటిని పూర్తిగా వదిలేయాలి. సమాధానం గుర్తించడంలో కచ్చితత్వానికే ప్రాధాన్యమివ్వాలి. అంచనాతో జవాబులు రాస్తే నష్టమే.

ముఖ్య సమాచారం

ఖాళీలు: 500. విభాగాల వారీ.. అన్ రిజర్వ్‌డ్ 203, ఓబీసీ 135, ఎస్సీ 75, ఎస్టీ 37, ఈడబ్ల్యూఎస్ 50 ఉన్నాయి.
విద్యార్హత: జనవరి 31, 2024 నాటికి ఏదైనా డిగ్రీ పూర్తవ్వాలి.
వయసు: జనవరి 31, 2024 నాటికి 20 - 25 ఏళ్ల లోపు ఉండాలి. అంటే జనవరి 31, 1999 - జనవరి 31, 2004 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు: ఏపీలో.. చీరాల, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం. తెలంగాణలో.. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.200. మిగిలిన అందరికీ రూ.1000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
వెబ్‌సైట్: https://www.idbibank.in/

ప్రశ్నలు ఏ అంశాల్లో?

జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్: బ్యాంకులు, ఆర్థిక వ్యవహారాలకు ఎక్కువ ప్రాధాన్యం. అందువల్ల.. ఆర్‌బీఐ, బ్యాంక్ పదజాలం, బీమా, రెపో, రివర్స్ రెపో, వడ్డీరేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలు, బ్యాంకులు-ప్రధాన కార్యాలయాలు-అధిపతులు.. ఇవన్నీ తెలుసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా రోజువారీ సంఘటనలే (వర్తమాన వ్యవహారాలు) ప్రశ్నలుగా వస్తాయి. దేశ చరిత్ర, సంస్కృతి, భూగోళం, పాలిటీ, సైన్స్‌లో ప్రాథమిక అవగాహనను పరిశీలిస్తారు. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు-రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు.. ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ఎకనామిక్స్‌లో ప్రాథమికాంశాలు చదువుతూ, ఆర్థిక ఒప్పందాలపై అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: శాతాలు, నిష్పత్తి-అనుపాతం, లాభ-నష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, కాలం-దూరం, కాలం-పని, పడవలు-ప్రవాహాలు, రైళ్లు, సరాసరి, వ్యాపార భాగస్వామ్యం ఇలా ప్రతి అంశం నుంచీ ఒక ప్రశ్న వస్తుంది. సమాధానం త్వరగా గుర్తించడానికి లాజిక్, షార్ట్ కట్స్ ఉపయోగించాలి. వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధన ద్వారా జవాబు త్వరగా గుర్తించే నైపుణ్యం సొంతమవుతుంది.

ఇంగ్లిష్ లాంగ్వేజ్: వ్యాకరణంపై అవగాహన పెంచుకోవాలి. వేగంగా చదివి, సమాచారాన్ని సంగ్రహించే నైపుణ్యాలు పెంపొందించుకుంటే కాంప్రహెన్షన్‌లో ఎక్కువ మార్కులు పొందవచ్చు. ఆంగ్ల దినపత్రికలు చదవడం, వార్తలు వినడం ద్వారా భాషపై పట్టు పెంచుకోవడానికి ప్రయత్నించాలి. కాంప్రహెన్షన్, క్లోజ్ టెస్ట్, జంబుల్డ్ సెంటెన్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్/కరెక్షన్ నుంచి కొన్ని, వ్యాకరణాంశాల నుంచి.. వర్డ్ సబ్‌స్టిట్యూషన్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సినానిమ్స్- యాంటానిమ్స్, వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్‌ల్లో ప్రశ్నలు అడుగుతారు.

బీఈడీ తర్వాత డిగ్రీ.. డీఎస్సీకి అర్హుడినేనా?

ఇంటర్ తర్వాత ఎంఏ అప్లైడ్ ఎకనామిక్స్ (ఇంటిగ్రేటెడ్ ఐదేళ్ల పీజీ) చేశాను. తర్వాత బీఈడీ చేసి 2017లో డీఎస్సీ రాస్తే ఉద్యోగానికి అర్హత లేదన్నారు. దాంతో డిగ్రీ చదివాను. ముందు బీఈడీ తర్వాత డిగ్రీ చేస్తే డీఎస్సీకి అర్హుడినవుతానా? నాకు సీటెట్-2, టెట్-2 అర్హత ఉంది. - అఖిల్

■ మీరు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ, బీఈడీ చేశాక 'డీఎస్సీకి అర్హత లేదు' అని ఎందుకు అన్నారో కారణం తెలుసుకొని ఉండాల్సింది. అప్పుడే మీరు ఉన్నతాధికారులనో, న్యాయస్థానాన్నో ఆశ్రయించివుంటే, మీ సమస్యకు పరిష్కారం లభించివుండేది. మీరు ఇంటిగ్రేటెడ్ పీజీ చదివిన విద్యాసంస్థను సంప్రదించి డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు విడివిడిగా ఇస్తారేమో కనుక్కోండి. కొన్ని యూనివర్సిటీలు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో ఎగ్జిట్ క్లాజ్ ప్రవేశపెట్టి యూజీ, పీజీ రెండు డిగ్రీలూ ఇస్తున్నాయి. ఇక మీ ప్రశ్న విషయానికి వస్తే- మీరు బీఈడీ చేసిన తరువాత డిగ్రీ చదివినా, డీఎస్సీకి అర్హులవుతారు. మీరు ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే బీఈడీ తరువాత డిగ్రీ చేశారు కాబట్టి ఆ విషయాన్ని సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో చెప్పే ప్రయత్నం చేయండి. ఒకవేళ వారు ఒప్పుకోకపోతే పై అధికారుల్ని కలవండి. జాతీయ విద్యావిధానం- 2020 పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చాక, ఇలాంటి చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మీరు నిరభ్యంతరంగా డీఎస్సీకి సన్నద్ధం కండి.

- ప్రొ. వెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తీర రక్షక దళంలో చేరతారా?

కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని భారతీయ తీర రక్షక దళం 260 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇంటర్మీడియట్ విద్యార్హతతో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. రాత, శరీరదార్ఢ్య, వైద్య పరీక్షల ద్వారా నియామకాలు చేపడతారు. ఎంపికైనవారికి శిక్షణ అందిస్తారు. అనంతరం వీరు నావిక్ జనరల్ డ్యూటీ సేవల్లో చేరతారు. వీరు లెవెల్-3 వేతనం అందుకోవచ్చు. దశలవారీ వృత్తిలో పదోన్నతులకూ అవకాశం ఉంది.

గమనించండి

ఖాళీలు: 260
(ఈస్ట్ జోన్‌లో 33)
అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్
వయసు: కనిష్ఠంగా 18 నుంచి గరిష్ఠంగా 22 ఏళ్ల లోపు ఉండాలి. అంటే సెప్టెంబరు 1, 2002 - ఆగస్టు 31, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.
ఆన్‌లైన్ దరఖాస్తులు: ఫిబ్రవరి 13 ఉదయం 11 గంటల నుంచి - ఫిబ్రవరి 27 సాయంత్రం 5:30 వరకు స్వీకరిస్తారు.
ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీలు చెల్లించనక్కర్లేదు.
పరీక్షలు: స్టేజ్-1 ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. స్టేజ్-2 మేలో, స్టేజ్-3 అక్టోబరులో ఉంటాయి.
స్టేజ్-1 పరీక్ష కేంద్రాలు: తెలంగాణలో.. హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్.
ఏపీలో.. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కాకినాడ.
వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in/

దాదాపు ఏటా రెండు సార్లు నావిక్ పోస్టుల భర్తీకి ఇండియన్ కోస్టు గార్డు ప్రకటనలు వెలువరిస్తోంది. వీటికి పురుషులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షకు సంబంధించి సిలబస్ వివరాలు, మాదిరి ప్రశ్నపత్రాలు కోస్టు గార్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

పరీక్ష ఇలా..

ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్షలు నిర్వహిస్తారు. రుణాత్మక మార్కులు లేవు. నాలుగు ఆప్షన్ల నుంచి సరైన సమాధానం గుర్తించాలి. మొత్తం 2 సెక్షన్లలో ప్రశ్నలు ఉంటాయి.

సెక్షన్-1: ఇందులో ప్రశ్నలు పదో తరగతి స్థాయిలోనే వస్తాయి. మొత్తం 60 మార్కులకు 60 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మ్యాథ్స్ 20, సైన్స్ 10, ఇంగ్లిష్ 15, రీజనింగ్ 10, జీకే 5 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు.

సెక్షన్-2: ఈ విభాగానికి 50 మార్కులు. 50 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 30 నిమిషాలు. ఇంటర్మీడియట్ సిలబస్ నుంచి మ్యాథ్స్, ఫిజిక్స్ ఒక్కో సబ్జెక్టులో 25 చొప్పున ప్రశ్నలు అడుగుతారు.

> **నావిక్ పోస్టుల్లో చేరితే లెవెల్-3 మూలవేతనం రూ.21,700 లభిస్తుంది. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ప్రోత్సాహకాలు అదనం. అన్నీ కలిపి సుమారు రూ.40 వేలు వేతనంగా పొందవచ్చు.**

అర్హత పొందాలంటే..

ప్రతి సెక్షన్‌లోనూ కనీస మార్కులు సాధించడం తప్పనిసరి. జనరల్ అభ్యర్థులు సెక్షన్-1లో 30, సెక్షన్-2లో 20 చొప్పున మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీలకు.. సెక్షన్-1లో 27, సెక్షన్-2లో 17 చొప్పున మార్కులు వస్తే అర్హులుగా పరిగణిస్తారు.

ఇలా అర్హత సాధించినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీలకు అనుగుణంగా స్టేజ్-2కు ఎంపిక చేస్తారు.

స్టేజ్-2: ఈ పరీక్షలు ఒకటి లేదా రెండు రోజుల వ్యవధితో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తే సరిపోతుంది. మార్కులు ఉండవు. ఇందులో భాగంగా.. పరీక్ష నిర్వహిస్తారు. దీనికి సమాధానాలు ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి. పరీక్ష జరిగిన గంట తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికే తర్వాతి దశకు పంపుతారు. అందులో భాగంగా.. 1.6 కి.మీ.దూరాన్ని 7 నిమిషాల్లో పరుగెత్తాలి. అలాగే 20 గుంజీలు, 10 పుష్ అప్స్ తీయగలగాలి. అభ్యర్థి ఎత్తు కనీసం 157 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీ కొలత వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. తప్పనిసరి.

స్టేజ్-3: దీని ఎంపిక స్టేజ్-1, స్టేజ్-2లో చూపిన ప్రతిభతో ఉంటుంది. స్టేజ్-2లో అర్హత సాధించినవారిని.. స్టేజ్-1 మెరిట్‌తో స్టేజ్-3కి ఎంపిక చేస్తారు. వీరికి ఐఎన్ఎస్ చిల్కాలో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో అర్హులు తర్వాతి దశకు చేరతారు.

స్టేజ్-4: దీనిలో భాగంగా అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలు పరిశీలించి, అన్నీ సరిగా ఉంటే శిక్షణకు తీసుకుంటారు.

శిక్షణ, వేతనం

ఈ పోస్టులో చేరే అవకాశం వచ్చినవారికి ప్రాథమిక శిక్షణ సెప్టెంబరు, 2024 నుంచి ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమవుతుంది. ఇది 16 వారాలు కొనసాగుతుంది. ఆ తర్వాత వీరికి సముద్రంలో సుమారు 6 నెలల నుంచి రెండేళ్ల వరకు శిక్షణ అందిస్తారు. దాన్ని విజయవంతంగా పూర్తిచేసుకున్నవారిని ఉద్యోగంలోకి తీసుకుంటారు. నావిక్ పోస్టుల్లో చేరినవారికి లెవెల్-3 మూలవేతనం రూ.21,700 చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ప్రోత్సాహకాలు అదనం. అన్నీ కలిపి ఈ పోస్టుల్లో చేరినవారు సుమారు రూ.40 వేలు వేతనం పొందవచ్చు. భవిష్యత్తులో వీరు నావిక్ నుంచి.. ఉత్తమ్ నావిక్, ప్రధాన నావిక్, అధికారి, ఉత్తమ్ అధికారి, ప్రధానాధికారి (లెవెల్-8) హోదా వరకు చేరుకోవచ్చు. ఉచితంగా రేషన్, దుస్తులు, వైద్యం అందిస్తారు. వసతి కల్పిస్తారు. క్యాంటీన్ సదుపాయం ఉంటుంది. ఏడాదికి 45 ఆర్జిత, 8 సాధారణ సెలవులు లభిస్తాయి.

ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: సస్టెక్ ఇన్నోవేషన్స్ ప్రై. లిమిటెడ్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 14
అర్హతలు: బిజినెస్ ప్లానింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ప్రొడక్ట్ ఇంట్రడక్షన్, కస్టమర్ అప్‌టీరీచ్ నైపుణ్యాలు
internshala.com/i/eea7d6

మిట్ ఏఆర్‌వీ టెక్నాలజీస్

1. ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్

స్టైపెండ్: నెలకు రూ.4,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ మోడలింగ్ నైపుణ్యాలు
internshala.com/i/5fb0ff

2. మార్కెటింగ్

స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
internshala.com/i/4a052e

3. హ్యూమన్ రిసోర్సెస్

స్టైపెండ్: నెలకు రూ.4,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్, నెగోషియేషన్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు
internshala.com/i/c1daa6

4. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్

స్టైపెండ్: నెలకు రూ.4,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాజెక్ట్, టైమ్ మేనేజ్‌మెంట్
internshala.com/i/c653e7

5. బిజినెస్ డెవలప్‌మెంట్

స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
internshala.com/i/1f9430

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

సంస్థ: హాట్‌నాట్
స్టైపెండ్: నెలకు రూ.5,000 + ఇన్సెంటివ్స్
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 17
అర్హతలు: కేన్వా, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, ఫొటోగ్రఫీ, సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/cd9881

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 17
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
internshala.com/i/a81081

మార్కెటింగ్

సంస్థ: స్వాద్ దిల్లీ కా
స్టైపెండ్: నెలకు రూ.5,000 + ఇన్సెంటివ్స్
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 17
అర్హతలు: డిజిటల్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఫొటోగ్రఫీ, సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో మేకింగ్
internshala.com/i/6062bc

విజయవాడలో

ఆపరేషన్స్

స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: ప్రాజెక్ట్ సపోర్ట్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్, డేటా ఎంట్రీ అండ్ అనాలిసిస్, క్రాస్-ఫంక్షనల్ టీమ్‌వర్క్ నైపుణ్యాలు
internshala.com/i/8d3d6f

విశాఖపట్నంలో

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: క్లౌడ్ఐ టెక్నాలజీస్ ఇండియా ప్రై.లి.
స్టైపెండ్: నెలకు రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 16
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, గూగుల్ యాడ్‌వర్డ్స్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/b5ec3b

వర్క్ ఫ్రమ్ హోమ్

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: ఐపీఏ ఇన్‌స్టిట్యూట్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 19
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/ 9c0fe9

ఐసీఎంఆర్‌లో..

న్యూదిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ... రెగ్యులర్ ప్రాతిపదికన 8 టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **టెక్నికల్ ఆఫీసర్ - బి:** 01
- **టెక్నికల్ ఆఫీసర్ - సి:** 07

విభాగాలు: బయోమెడికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ప్రోగామర్, మెకానికల్/ మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్.
అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీతోపాటు పని అనుభవం.
వయసు: టెక్నికల్ ఆఫీసర్-బి పోస్టులకు 35 ఏళ్లు; టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు 45 సంవత్సరాలు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08-03-2024.
వెబ్‌సైట్: https://main.icmr.nic.in/

ఐఐజేఏఎం, బెంగళూరులో పీజీ డిప్లొమా

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం అండ్ న్యూ మీడియా 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం (పీజీడీజే)

విభాగాలు: ప్రింట్/ బ్రాడ్‌కాస్ట్/ మల్టీమీడియా
అర్హత: డిగ్రీ.
ఎంపిక: అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ఆధారంగా.
దరఖాస్తులు పంపాల్సిన చిరునామా: అడ్మిషన్స్ ప్రాసెసింగ్ ఆఫీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జర్నలిజం అండ్ న్యూ మీడియా, నం.406, 6వ మెయిన్ రోడ్, 2వ బ్లాక్, బెంగళూరు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31-03-2024.
వెబ్‌సైట్: https://www.iijnm.org/

RAILWAY JOBS
5,696 లోకో పైలట్
ఈనాడు ప్రతిభ
Notification
Apply Now
ఉద్యోగాల రాత పరీక్ష ప్రత్యేక సమాచారం!
స్ట